అరబిందో విస్తరణ!

హైదరాబాద్, సెప్టెంబర్ 2: ఫార్మా దిగ్గజం అరబిందో ఫార్మా తన వ్యాపారాన్ని శరవేగంగా విస్తరిస్తున్నది. ఆర్ అండ్‌డీని మరింత బలోపేతం చేయడంతోపాటు నిర్మాణ దశలో ఉన్న ఆరు కొత్త ప్లాంట్లు త్వరలో అందుబాటులోకి రాబోతున్నాయని ప్రకటించింది. ఇప్పటికే సంస్థకు 29 ఉత్పత్తి కేంద్రాలు ఉండగా, వీటిద్వారా ప్రతియేటా 50 బిలియన్ల ఔషధాలన ఉత్పత్తి చేస్తున్నది.

సింగరేణి లక్ష్యం మిస్

జయశంకర్ భూపాలపల్లి. సెప్టెంబర్ 2 (నమస్తే తెలంగాణ) : బొగ్గు ఉత్పత్తిలో సింగరేణి లక్ష్యం అంచనాలకు చేరుకోలేకపోయింది. గత నెలకుగాను 100 శాతం లక్ష్యంగా పెట్టుకున్నప్పటికి దీంట్లో 83 శాతం సాధించింది. ముఖ్యంగా ఇల్లందు ఏరియా ముందంజలో ఉండగా, బెల్లంపల్లి ఏరియా వెనుకబడింది. కొత్తగూడెం ఏరియాలో 9,96,502 టన్నుల లక్ష్యం అధిగమించి 9,93, 318 టన్నులు ఉత్పత్తి చేసింది. అలాగే ఇల్లందు ఏరియాలో 3,29,200 టన్నులు (127 శాతం), మణుగూరు ఏరియాలో 5,34, 316 (67 శాతం), బెల్లంపల్లి ఏరియాలో 1,15,452 (48 శాతం), మందమర్రిలో 1,90, 008 (76 శాతం), శ్రీరాంపూర్ ఏరియాలో 2,68, 817 (59 శాతం), ఆర్‌జీ-1లో 2,90,647 (79 శాతం), ఆర్‌జీ-2 ఏరియాలో 4,40,009 (92 శాతం), ఆర్‌జీ-3 ఏరియాలో 4,14,520 (99 శాతం) బొగ్గు ఉత్పత్తి జరిగింది.

ఎన్‌సీసీకి 1,236 కోట్ల ఆర్డర్

హైదరాబాద్, సెప్టెంబర్ 2: గత నెలలో రూ.1,236 కోట్ల విలువైన ఆర్డర్లు లభించినట్లు ఎన్‌సీసీ లిమిటెడ్ ప్రకటించింది. వీటిలో ఇరిగేషన్ విభాగం నుంచి వచ్చినట్లు పేర్కొంది.

కాంగ్రెస్ వచ్చె.. ‘కేన్స్’ పాయె!

- గుజరాత్‌కు తరలిన కేన్స్ సెమీకండక్టర్ల పరిశ్రమ
- సనంద్‌లో రూ. 3,300 కోట్ల పెట్టుబడి
- ఆమోదించిన కేంద్ర క్యాబినెట్
- రాష్ట్రానికి వచ్చినట్టే వచ్చి యూటర్న్
- బీఆర్‌ఎస్ హయాంలో భూమి కేటాయింపు
- ఎలక్ట్రానిక్స్ యూనిట్‌తో సరి
- ఐదు పరిశ్రమల్లో నాలుగు గుజరాత్‌లోనే

హైదరాబాద్, సెప్టెంబర్ 2(నమస్తే తెలంగాణ): ఊహించిందే అయింది. గుజరాత్‌లో కేన్స్ సెమీకండక్టర్ల తయారీ పరిశ్రమకు సోమవారం కేంద్ర క్యాబినెట్ ఆమోదం తెలిపింది. మన రాష్ట్రంలో ఏర్పాటు కావాల్సిన ఈ పరిశ్రమ ఎన్నికల అనంతరం రాష్ట్రంలో చోటుచేసుకున్న రాజకీయ పరిణామాలతో గుజరాత్‌కు తరలివెళ్లినట్టు ఆరోపణలున్నాయి. బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఇదివరకే ఈ సంస్థకు భూమిని కేటాయించడంతో కంటి తుడుపు చర్యగా అక్కడ సెమీకండక్టర్ల పరిశ్రమకు బదులు ఎలక్ట్రానిక్స్ ఉత్పత్తుల తయారీ యూనిట్‌తో కేన్స్ సరిపెట్టింది. గుజరాత్‌లోని సనంద్‌లో రూ. 3,300 కోట్ల పెట్టుబడితో సెమీకండక్టర్ల యూనిట్ ఏర్పాటుకు కేన్స్ సెమికాన్ ప్రైవేట్ లిమిటెడ్ పెట్టుకున్న ప్రతిపాదనకు కేంద్ర క్యాబినెట్ ఆమోదం తెలిపింది. ఈ యూనిట్‌లో రోజుకు 60 లక్షల చిప్‌లు తయారు చేయనున్నారు. పరిశ్రమలు, ఆటోమోటివ్, ఎలక్ట్రిక్ వెహికిల్స్, కన్స్యూమర్ ఎలక్ట్రానిక్స్, టెలికం, మొబైల్ ఫోన్స్ తదితర వాటికి ఉపయోగపడే చిప్‌లు ఇక్కడ తయారు కానున్నాయి. భారత్‌లో సెమీ కండక్టర్స్, డిస్‌ప్లే మాన్యుఫ్యాక్చరింగ్ ఎకోసిస్టంను అభివృద్ధి చేసే కార్యక్రమంలో భాగంగా కేంద్ర ప్రభుత్వం ఈ రంగానికి డిసెంబర్, 2021లో రూ. 76,000 కోట్లు కేటాయించింది. జూన్ 2023న గుజరాత్‌లోని సనంద్‌లో మొదటి సెమీకండక్టర్ యూనిట్‌కు, ఈ ఏడాది ఫిబ్రవరిలో మరో మూడు సెమీకండక్టర్ల తయారీ యూనిట్లకు కేంద్రం ఆమోదం తెలిపింది. టాటా ఎలక్ట్రానిక్స్ గుజరాత్‌లోని ధొలేరా, అస్సాంలోని మోరీగాంలో సెమీకండక్టర్ల యూనిట్లను ఏర్పాటు చేయనుండగా, సీజీ పవర్ అనే సంస్థ గుజరాత్‌లోని సనంద్‌లో యూనిట్‌ను నెలకొల్పనుంది. ప్రస్తుతం ఈ నాలుగు సెమీకండక్టర్ యూనిట్ల ఏర్పాటు ప్రక్రియ కొనసాగుతుండగా, వీటి మొత్తం పెట్టుబడి రూ. 1.5 లక్షల కోట్లు. వీటి మొత్తం సామర్థ్యం రోజుకు 7 కోట్ల చిప్‌ల తయారీ. తాజాగా కేన్స్ సెమికాన్‌కు రోజుకు 60 లక్షల చిప్‌ల తయారీ యూనిట్‌కు కేంద్రం ఆమోదం తెలిపింది.

మనకు ఎలక్ట్రానిక్స్ యూనిట్‌తో సరి

వాస్తవానికి కేన్స్ సెమికాన్ సంస్థ రూ. 2,800 కోట్ల పెట్టుబడితో రాష్ట్రంలో సెమీకండక్టర్ల తయారీ యూనిట్‌ను ఏర్పాటు చేసేందుకు గత బీఆర్‌ఎస్ ప్రభుత్వంతో ఒప్పందం చేసుకోవడమే కాకుండా నిరుడు అక్టోబర్‌లోనే రంగారెడ్డి జిల్లా కొంగరకలాన్‌లో యూనిట్ నిర్మాణ పనులు చేపట్టింది. రాష్ట్రంలో ప్రభుత్వం మారిన తరువాత, ఈ ఏడాది మార్చిలో నిర్మాణ పనులను అర్ధాంతరంగా నిలిపివేసింది. సదరు సంస్థ మన రాష్ట్రంలో యూనిట్ ఏర్పాటు ప్రణాళికలను నిలిపివేసి గుజరాత్‌లో ఏర్పాటు చేయాలని నిర్ణయించుకొన్నదని, కొంగరకలాన్‌లో చేపట్టిన ప్రాజక్టును ఈఎంఎస్(ఎలక్ట్రానిక్స్ మాన్యుఫ్యాక్చరింగ్ సర్వీసెస్) యూనిట్‌గా మార్పు చేస్తున్నట్టు అప్పట్లో వార్తలొచ్చాయి. ఈ క్రమంలోనే గత ఆగస్టు 23న కొంగరకలాన్‌లో ఈఎంఎస్‌ను కేన్స్ సంస్థ ప్రారంభించింది. ఈ యూనిట్ ప్రారంభోత్సవం సందర్భంగా సంస్థ సీఈవో రఘు ఫణికర్ మాట్లాడుతూ, కొంగరకలాన్ యూనిట్‌లో ప్రధానంగా స్మార్ట్ మీటర్లతోపాటు మెయిన్ బోర్డులు, ఎన్ఐసీ కార్డ్, ప్లాస్టిక్, ఇంజెక్షన్ మౌల్డింగ్ మెషీన్లు తయారవుతాయని తెలిపారు. ఇక్కడ ప్రస్తుతం రెండు మాత్రమే తయారీ లైన్లు ఉన్నట్టు, భవిష్యత్తులో వీటిని 15-16లైన్లకు విస్తరించనున్నట్టు పేర్కొన్నారు. అనంతరం ఇక్కడ సెమీకండక్టర్లకు సంబంధించిన అనుబంధ వస్తువులైన సబ్‌స్ట్రేట్, కో-ప్యాకేజ్ ఆప్టిక్స్, లైట్ స్పీడ్ ఫోటోనిక్స్ తదితరవాటిలో కొన్నింటిని కొంగరకలాన్‌లో తయారు చేస్తామని వివరించారు. ఈ యూనిట్ ప్రారంభానికి ముందు ఫణికర్ సచివాలయంలో ముఖ్యమంత్రిని కలిసి రాష్ట్రంలో సెమీకండక్టర్ల తయారీ యూనిట్ ఏర్పాటు పరిశీలనలో ఉందని చెప్పడం గమనార్హం. తమకు ప్రస్తుతం తెలంగాణలో 46 ఎకరాల భూమి మాత్రమే ఉన్నదని, ఇది తమ అవసరాలకు కావాల్సిన భూమిలో పదో వంతు మాత్రమేనని వివరించారు.

చేజారిన అవకాశం..

బీఆర్‌ఎస్ హయాంలో రాష్ట్రంలో ఎలక్ట్రానిక్స్ రంగాన్ని బలోపేతం చేయడంతోపాటు సెమీకండక్టర్ల తయారీకి హైదరాబాద్‌ను కేంద్రంగా తీర్చిదిద్దాలని సంకల్పించింది. ఈ క్రమంలోనే పలు ప్రఖ్యాత సంస్థలతో సంప్రదింపులు జరిపిన అప్పటి పరిశ్రమల మంత్రి కేటీఆర్.. కేన్స్ సెమికాన్‌తో చర్చించి రాష్ట్రంలో సెమీకండక్టర్ల యూనిట్ ఏర్పాటునకు ఒప్పించారు. ఫలితంగా ఇక్కడ పరిశ్రమ ఏర్పాటు చర్యలను ప్రారంభించిన సదరు సంస్థ, అసెంబ్లీ ఎన్నికల అనంతరం ఒక్కసారిగా నిర్ణయాన్ని మార్చుకొని గుజరాత్‌లో సెమీకండక్టర్ల పరిశ్రమను ఏర్పాటు చేస్తున్నది. ఒకవేళ ఈ పరిశ్రమ రాష్ట్రంలో ఏర్పాటైతే భవిష్యత్తులో గుజరాత్‌కు పోటీగా మన రాష్ట్రంలో కూడా మరిన్ని సెమీకండక్టర్ల తయారీ పరిశ్రమలు ఏర్పాటయ్యేవని పరిశ్రమ వర్గాలు చెప్తున్నాయి. ఐదింటిలో నాలుగు పరిశ్రమలు గుజరాత్‌లోనే ఏర్పాటు కావడంతో క్రమంగా సెమీకండక్టర్ల రంగానికి గుజరాత్ కేంద్రంగా ఎదుగుతున్నదని వారు పేర్కొంటున్నారు.

టాటా కర్వ్ ఐస్ మాడల్స్

ప్రారంభ ధర రూ.9.99 లక్షలు

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 2: దేశీయ ఆటోమొబైల్ దిగ్గజం టాటా మోటర్స్..మార్కెట్లోకి మధ్యస్థాయి ఎస్‌యూవీకూప్ కర్వ్ మాడల్‌ను అందుబాటులోకి తీసుకొచ్చింది. పెట్రోల్, డీజిల్ ఇంజిన్‌తో రూపొందించిన ఈ మాడల్ రూ.9.99 లక్షల ప్రారంభ ధరతో లభించనున్నది. ఈ సందర్భంగా టాటా మోటర్స్ ప్యాసింజర్ వాహన విభాగ ఎండీ శైలేష్ చంద్ర మాట్లాడుతూ..దేశంలో అత్యంత వేగంగా వృద్ధి చెందుతున్న మధ్యస్థాయి ఎస్‌యూవీ సెగ్మెంట్‌లో కర్వ్‌ను విడుదల చేసినట్లు, ప్రతియేటా ఈ సెగ్మెంట్‌లో ఏడు లక్షల వాహనాలు అమ్ముడుకానుండటంతో సంస్థల మధ్య పోటీ తీవ్రంగా నెలకొన్నది. హ్యుందాయ్ క్రెటా, కియా సెల్టోస్, మారుతి గ్రాండ్ విటారా, టయోటా అర్బన్ క్రూజర్, హోండా ఎలివేట్‌లకు పోటీగా సంస్థ ఈ మాడల్‌ను ప్రవేశపెడుతున్నది. ఆరు రంగుల్లో లభించనున్న ఈ మాడల్ రూ.9.99 లక్షల నుంచి రూ.18 లక్షల లోపు లభించనున్నది. 12.3 ఇంచుల టచ్‌స్క్రీన్, ఎలక్ట్రిక్ పార్కింగ్ బ్రేక్, అన్ని వైపుల కెమెరాలు, వైర్‌లెస్ చార్జర్ వంటి ఫీచర్స్‌తో తయారు చేసింది.

ఆల్టో ధర 6,500 తగ్గింపు

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 2: కార్ల తయారీలో అగ్రగామి సంస్థయైన మారుతి సుజుకీ.. ఎంట్రీ లెవల్ కార్ల ధరలను తగ్గించింది. ఆల్టో కే 10, ఎస్-ప్రెస్సో మాడళ్ల ధరలను రూ. 6,500 వరకు తగ్గిస్తూ నిర్ణయం తీసుకున్నది. తగ్గించిన ధరలు వెంటనే అమలులోకి రానున్నట్లు పేర్కొంది. సంస్థ తీసుకున్న తాజా నిర్ణయంతో ఎస్-ప్రెస్సో ఎల్‌ఎక్స్‌ఐ పెట్రోల్ వెర్షన్ రూ.2,000 తగ్గనుండగా, ఆల్టో కే10 వీఎక్స్‌ఐ పెట్రోల్ వెర్షన్ రూ.6,500 కూడా తగ్గనున్నది. దీంతో ఆల్టో కే10 మాడల్ ధర రూ.3.99-5.96 లక్షలకు లభించనుండగా, ఎస్-ప్రెస్సో రూ.4.26 లక్షల నుంచి రూ.6.11 లక్షల లోపు లభించనున్నాయి. ఈ ధరలు ఢిల్లీ షోరూంనకు సంబంధించినవి.

పెరిగిన బజాజ్ అమ్మకాలు

గత నెలకుగాను 3,97,804 యూనిట్ల వాహనాలను విక్రయించినట్లు బజాజ్ ఆటో ప్రకటించింది. ఏడాది క్రితం ఇదే నెలలో అమ్ముడైన 3,41,648 యూనిట్లతో పోలిస్తే 16 శాతం పెరిగాయని తెలిపింది. వీటిలో దేశీయంగా 2,53,827 యూనిట్లు, 1,43,977 యూనిట్లను ఎగుమతి చేసింది.

రికార్డు స్థాయికి చేరుకున్న సూచీలు

ముంబై, సెప్టెంబర్ 2: దేశీయ స్టాక్ మార్కెట్ల లాభాల పరంపర కొనసాగుతున్నది. వరుసగా పదోరోజు సోమవారం కూడా సూచీలు కదంతొక్కాయి. విదేశీ సంస్థాగత పెట్టుబడిదారులు భారీగా పెట్టుబడులు పెడుతుండటం, అమెరికా మార్కెట్ల ర్యాలీ కొనసాగుతుండటంతో దేశీయ సూచీలు చారిత్రక గరిష్ఠ స్థాయికి చేరుకున్నాయి. ఇంట్రాడేలో 350 పాయింట్లకు పైగా లాభపడి నూతన గరిష్ఠ స్థాయికి 82,725 పాయింట్లను తచ్చాడిన 30 షేర్ల ఇండెక్స్ సూచీ సెన్సెక్స్ మార్కెట్ ముగిసే సమయానికి 194 పాయింట్లు అందుకొని 82,559.84 పాయింట్ల వద్ద ముగిసింది. సెప్టెంబర్ 2023 తర్వాత వరుసగా పదిరోజులుగా లాభపడటం ఇదే తొలిసారి కావడం విశేషం. మరోసూచీ నిఫ్టీ 13 రోజులుగా లాభాల్లోనే కదలాడుతున్నది. గత దశాబ్దకాలంలో తొలిసారిగా వరుసగా ఇన్ని రోజులు లాభపడటం ఇదే తొలిసారి. సోమవారం కూడా 42.80 పాయింట్లు అందుకొని చారిత్రక గరిష్ఠ స్థాయి 25,278.70 పాయింట్లకు ఎగబాకింది. గత 13 సెషన్లలో నిఫ్టీ 1,140 పాయింట్లు లేక 4.72 శాతం బలపడగా, సెన్సెక్స్ వరుస పది సెషన్లలో 2,135.16 పాయింట్లు లాభపడ్డాయి.

సిప్‌లో నెలకు రూ.250!: సెబీ చీఫ్

ముంబై, సెప్టెంబర్ 2: పెట్టుబడులను ప్రోత్సహించడంలో భాగంగా మార్కెట్ నియంత్రణ మండలి సెబీ మరో కీలక నిర్ణయం తీసుకోబోతున్నది. సిస్టమెటిక్ ఇన్వెస్ట్‌మెంట్ ప్లాన్(సిప్) కింద నెలకు రూ.250 చొప్పున మ్యూచువల్ ఫండ్లలో పెట్టుబడులు పెట్టే అవకాశాలు త్వరలో అందుబాటులోకి రాబోతున్నాయి. స్టార్‌బక్స్‌లో కాఫీకి పెట్టే ఖర్చు స్థాయిలోనే సిప్‌లో పెట్టుబడులు పెట్టే సమయం త్వరలో రాబోతున్నదని సెబీ చైర్మన్ మాధాబి బచ్ పురి ఈ సందర్భంగా తెలిపారు. ఈ బృహత్ ప్రణాళికపై అసోసియేషన్ ఆఫ్ మ్యూచువల్ ఫండ్స్ ఇన్ ఇండియా(యాంఫీ)తోపాటు కీలక సంస్థలతో సంప్రదింపులు జరిపినట్లు భారత పరిశ్రమల సమాఖ్య(సీఐఐ) ఏర్పాటు చేసిన వార్షిక సదస్సులో వెల్లడించారు. తక్కువ స్థాయి పెట్టుబడి ప్రతిపాదనను మరింత సమర్థవంతంగా అమలు చేయడానికి సాంకేతిక పరంగా మార్పులు చేయాల్సిన అవసరం కూడా ఉన్నదన్నారు. మరో వైపు, సింగిల్ ఫైలింగ్‌తో స్టాక్ ఎక్స్ఛేంజ్‌ల్లో లిస్ట్ అయ్యేందుకు వీలుపడనున్నది.

లాభాలొస్తే వారంలోనే విక్రయం

స్టాక్ మార్కెట్‌లో మదుపరుల పెట్టుబడులపై సెబీ ప్రత్యేక నివేదికను విడుదల చేసింది.



ఐపీవోలో షేర్లు అలాట్‌మెంట్ జరిగిన వారంలోనే 54 శాతం షేర్లను మదుపరులు విక్రయిస్తున్నట్లు సెబీ అధ్యయనంలో వెల్లడైంది. నష్టాలు వచ్చినప్పటితో పోలిస్తే లాభాలు వచ్చినప్పుడు ఈ తరహా విక్రయాలు ఎక్కువగా ఉంటున్నాయని పేర్కొంది. 2021 నుంచి 2023 వరకు 144 ఐపీవోల డాటా ఆధారంగా ఈ నివేదికను రూపొందించింది.

దేశీయ ట్రాక్టర్ల తయారీ దిగ్గజం మహీంద్రా అండ్ మహీంద్రా తొలిసారిగా సీబీజీ (కంప్రెస్డ్ బయో-గ్యాస్) ఆధారిత యువో టెక్ ప్లస్ ట్రాక్టర్‌ను ఢిల్లీలో కేంద్ర రవాణా, జాతీయ రహదారులు శాఖ మంత్రి నితిన్ గడ్కరీ ఆవిష్కరించారు. మహీంద్రా సీబీజీ పవర్డ్ ట్రాక్టర్‌లో కంప్రెస్డ్ నేచురల్ గ్యాస్‌తో కాలుష్య కారకాలను తగ్గించడంతోపాటు కర్బన ఉద్గారాలను తగ్గించవచ్చునని పేర్కొంది. డీజిల్ ట్రాక్టర్ టెక్నాలజీతో పోలిస్తే అత్యంత శక్తివంతంగా, సమర్థవంతంగా పనిచేయనున్నది ఈ ట్రాక్టర్.

స్కూళ్లల్లో కాంపొజిట్ స్కిల్ ల్యాబ్‌లు

- ఏర్పాటుకు మూడేండ్ల గడువు
- ఆరో తరగతి నుంచే నైపుణ్య శిక్షణ
- స్కూళ్లను ఆదేశించిన సీబీఎస్‌ఈ

హైదరాబాద్, సెప్టెంబర్ 2 (నమస్తే తెలంగాణ): పాఠశాల దశలోనే ఆరో తరగతి నుంచే విద్యార్థులకు నైపుణ్య శిక్షణ ఇచ్చేందుకు సీబీఎస్‌ఈ కీలక నిర్ణయం తీసుకుంది. స్కూళ్లల్లో కాంపొజిట్ స్కిల్ ల్యాబ్‌లను ఏర్పాటు చేయాలని సూచించింది. సీబీఎస్‌ఈ ఇటీవలే ప్రిన్సిపాళ్లకు లేఖలు రాసింది. మూడేండ్లల్లో తప్పనిసరిగా ల్యాబ్‌లను ఏర్పాటు చేసుకోవాలని గడువు విధించింది. సీబీఎస్‌ఈ 139వ పాలకమండలి సమావేశంలో ఇదే అంశంపై సుదీర్ఘంగా చర్చించి, ల్యాబ్‌ల ఏర్పాటుకు పచ్చజెండా ఊపింది. జాతీయ విద్యావిధానం-2020లో భాగంగా నేషనల్ కరిక్యులం ఫ్రేమ్ వర్క్‌ను కేంద్ర విద్యాశాఖ విడుదల చేసింది. 6 నుంచి 12 తరగతుల్లో స్కిల్‌డెవలప్‌మెంట్‌ను అంతర్భాగంగా చేర్చింది. 6వ తరగతిలో చేరిన వారు ఏదో ఒక స్కిల్ కోర్సును అభ్యసించాల్సిందే. దీంట్లో భాగంగా బడుల్లో స్కిల్ ల్యాబ్‌లు, వృత్తిశిక్షణా కేంద్రాలను ఏర్పాటు చేయాలని సూచించింది.

రైతులందరికీ రుణమాఫీ చేయాలి

ఎలాంటి షరతులు లేకుండా రైతులందరికీ రుణమాఫీ చేయాలని సోమవారం గ్రేటర్ వరంగల్ 16వ డివిజన్ ధర్మారం ఇండియన్ బ్యాంకు ఎదుట అన్నదాతలు ఆందోళన చేపట్టారు. అనంతరం వరంగల్-నర్సంపేట ప్రధాన రహదారిపై రాస్తారోకో నిర్వహించారు. ఇండియన్ బ్యాంక్ నుంచి బొడ్డుచింతలపల్లి, పోతురాజుపల్లి, ధర్మారం, స్తంభంపల్లి, వసంతాపురం గ్రామాలకు చెందిన 1,293 మంది రైతులు రుణాలు తీసుకుంటే.. 270 మందికి మాఫీ అయిందని, మిగతా రైతులకు మాఫీ వర్తించలేదని రైతు సంఘం నాయకులు శ్రీనివాస్, రైతులు ముత్తిలింగం, విద్యాసాగర్, గోలి రాజయ్య తెలిపారు. ప్రభుత్వం వెంటనే షరతులు లేకుండా రుణమాఫీ చేయాలని, లేనిపక్షంలో ఉద్యమిస్తామని రైతులు హెచ్చరించారు. - గీసుగొండ

రేపు చలో విద్యుత్తు సౌధ

హైదరాబాద్, సెప్టెంబర్ 2 (నమస్తే తెలంగాణ): విద్యుత్తు సంస్థల్లో పదోన్నతులపై హైకోర్టు సిట్టింగ్ జడ్జి, జ్యుడిషియల్ కమిషన్‌చేత విచారణ జరిపించాలని తెలంగాణ విద్యుత్తు బీసీ, ఓసీ ఉద్యోగుల ఐక్య కార్యాచరణ సమితి బుధవారం చలో విద్యుత్తు సౌధకు పిలుపునిచ్చింది. ఉద్యోగులంతా తరలివచ్చి మహాధర్నాను విజయవంతం చేయాలని జేఏసీ చైర్మన్ కుమారస్వామి, కో చైర్మన్ సుధాకర్‌రెడ్డి, కన్వీనర్ ముత్యం వెంకన్నగౌడ్, కో కన్వీనర్ భానుప్రకాశ్ పిలుపునిచ్చారు.

హాస్టల్ వెల్ఫేర్ సమస్యలు పరిష్కరించాలి: టీఎన్జీవో

హైదరాబాద్, సెప్టెంబర్ 2(నమస్తే తెలంగాణ): హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్ల సమస్యలను పరిష్కరించాలని టీఎన్జీవో రాష్ట్ర అధ్యక్షుడు మారం జగదీశ్వర్, ప్రధాన కార్యదర్శి ఎస్ఎం హుస్సేనీ డిమాండ్ చేశారు. హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్ల ఫోరం సమావేశాన్ని అధ్యక్షుడు ఎండీ ఖాజా మొయినుద్దీన్ ఆధ్వర్యంలో సోమవారం నాంపల్లిలోని టీఎన్జీవోభవన్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. వర్కర్లను కేటాయించాలని, గ్రీన్‌చానల్ ద్వారా బడ్జెట్‌ను విడుదల చేయాలని, పర్చేజ్ కమిటీలో హెచ్‌డబ్ల్యూవోలకు భాగస్వామ్యం కల్పించాలని డిమాండ్ చేశారు.

చివర్లో కోర్టుకు వస్తే ఎలా?

- గణేశ నిమజ్జనాలకు ముందు పిటిషన్ వేయడంపై హైకోర్టు ఆగ్రహం

హైదరాబాద్, సెప్టెంబర్ 2 (నమస్తే తెలంగాణ): హైదరాబాద్‌లో అత్యంత ప్రతిష్ఠాత్మకంగా జరిగే గణేశ నిమజ్జన వ్యహారంపై చిట్ట చివరి సమయంలో న్యాయస్థానాన్ని ఆశ్రయించిన పిటిషనర్‌పై హైకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. గతంలో వెలువరించిన ఉత్తర్వులను అమలు చేయకపోవడం కోర్టు ధిక్కారమే అవుతుందంటూ వ్యక్తిగత హోదాలో న్యాయవాది ఎం వేణుమాధవ్ దాఖలు చేసిన పిటిషన్‌కు నంబర్‌ను కేటాయించేందుకు హైకోర్టు రిజిస్ట్రీ అభ్యంతరం వ్యక్తం చేయడంతో ఈ వ్యవహారంపై చీఫ్ జస్టిస్ అలోక్ అరాధే, జస్టిస్ జే శ్రీనివాసరావు ధర్మాసనం సోమవారం విచారణ చేపట్టింది. జ్వరం రావడం వల్ల ముందస్తుగా పిటిషన్ వేయలేకపోయానని పిటిషనర్ చెప్పడంతో.. చివరి క్షణాల్లో పిటిషన్ వేయడం సరికాదని, ఇది కోర్టుపై ఒత్తిడి తీసుకురావడం, బ్లాక్‌బెయిల్ చేయడం కిందికే వస్తుందని వ్యాఖ్యానించింది. అయినప్పటికీ ఇది ప్రజాహితంతో కూడిన వ్యవహారమని, దీనిపై తామే విచారణ చేస్తామని ప్రకటించింది. ఈ వ్యవహారంపై కౌంటర్ దాఖలు చేసేందుకు సమయం కావాలని తెలంగాణ గణేశ్ ముక్తి కళాకార్ వెల్ఫేర్ అసోసియేషన్ తరపు న్యాయవాది కోరడంతో తదుపరి విచారణ 9కి వాయిదా వేస్తున్నట్టు ధర్మాసనం ప్రకటించింది.

ఆ వ్యాఖ్యలు వ్యక్తిగతం

స్మితా సబర్వాల్‌పై పిటిషన్‌ను కొట్టివేసిన హైకోర్టు

హైదరాబాద్, సెప్టెంబర్ 2 (నమస్తే తెలంగాణ): ఐఏఎస్ లాంటి ఉన్నత పదవుల్లో దివ్యాంగులకు రిజర్వేషన్లు కల్పించాల్సిన అవసరం లేదంటూ రాష్ట్ర ఆర్థిక సంఘం సభ్య కార్యదర్శి స్మితా సబర్వాల్ చేసిన వ్యాఖ్యలపై దాఖలైన పిటిషన్‌ను హైకోర్టు సోమవారం కొట్టివేసింది. వ్యాఖ్య వల్ల ఎవరి హక్కులకు భంగం వాటిల్లినట్టు ఆధారాలు లేవని హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అలోక్ అరాధే, జస్టిస్ శ్రీనివాసరావు ధర్మాసనం స్పష్టం చేసింది. ఆమె వ్యాఖ్యలతో దివ్యాంగుల రిజర్వేషన్లు తొలగించడం కూడా జరగలేదంది.

వాష్‌రూమ్‌లో కెమెరాలపై ఎన్‌హెచ్‌ఆర్సీ సీరియస్

హైదరాబాద్, సెప్టెంబర్ 2 (నమస్తే తెలంగాణ): ఏపీ కృష్ణా జిల్లాలో మహిళా కళాశాల వాష్‌రూమ్, కర్ణాటకలోని బెంగళూరు తినుబండారం షాపులో రహస్య కెమెరాలు ఉన్నట్టు వెలుగుచూసిన ఘటనలను ఎన్‌హెచ్‌ఆర్సీ సుమోటాగా స్వీకరించింది. మహిళల భద్రత, గౌరవప్రద జీవన హక్కులపై తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది.

‘టీవీ-9 రవిప్రకాశ్‌పై కేసు ఉపసంహరణ చట్టవ్యతిరేకం’

హైదరాబాద్, సెప్టెంబర్ 2 (నమస్తే తెలంగాణ): ఫోర్జరీ, నిధుల దుర్వినియోగం వంటి నేరాలకు పాల్పడినట్టు అభియోగాలు ఎదుర్కొంటున్న టీవీ-9 మాజీ డైరెక్టర్ రవి ప్రకాశ్‌పై క్రిమినల్ కేసు ఉపసంహరణకు ప్రభుత్వం గత నెల 15న జీవో జారీ చేయడం, దాని ఆధారంగా కూకట్‌పల్లి మేజిస్ట్రేట్ కోర్టు ఉపసంహరణ ఉత్తర్వులు జారీ చేయడం చట్టవిరుద్ధమని అలాందా మీడియా ఎంటర్‌టైన్‌మెంట్ లిమిటెడ్ హైకోర్టుకు తెలిపింది. ఈ ఉత్తర్వులను సవాలు చేస్తూ ఆ సంస్థ డైరెక్టర్ కౌశిక్‌రావు వేసిన పిటిషన్‌పై జస్టిస్ ఈవీ వేణుగోపాల్ సోమవారం విచారణ చేపట్టారు. పిటిషనర్ తరపున సీనియర్ న్యాయవాది టీ నిరంజన్‌రెడ్డి వాదిస్తూ.. ఎలాంటి కారణాలను పేర్కొనకుండా ఈ కేసు ఉపసంహరణకు మేజిస్ట్రేట్ ఉత్తర్వులు జారీచేశారని, ఇది నిబంధనల ఉల్లంఘన కిందకు వస్తుందని చెప్పారు. యాంత్రికంగా జారీచేసిన ఈ ఉత్తర్వులను రద్దు చేయాలని కోరారు. దీంతో కౌంటర్ దాఖలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వానికి, రవి ప్రకాశ్‌కు, ఇతర ప్రతివాదులకు నోటీసులు జారీచేసిన హైకోర్టు.. తదుపరి విచారణను ఈ నెల 5కి వాయిదా వేసింది.

కూల్చివేతలపై హైకోర్టు స్టే

హైదరాబాద్, సెప్టెంబర్ 2 (నమస్తే తెలంగాణ): రంగారెడ్డి జిల్లా రాజేంద్రనగర్ మండలం ఖానాపూర్‌లో తమ ఇండ్ల కూల్చివేతకు అధికారులు నోటీసులు జారీ చేయడాన్ని సవాలు చేస్తూ విద్యాధర్‌రెడ్డి, అనుపమ దాఖలు చేసిన వ్యాజ్యాలపై హైకోర్టు సోమవారం విచారణ చేపట్టింది. ఉస్మాన్‌సాగర్ చెరువుకు సంబంధించిన మ్యాప్ వివరాలను అందజేయాలని, తదుపరి ఉత్తర్వులు జారీచేసే వరకు నిర్మాణాలను కూల్చివేయరాదని ప్రభుత్వానికి మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. గత తనిఖీల తర్వాత ఎఫ్‌టీఎల్ పరిధిలో ఇండ్ల స్థలాలు లేవని అధికారికంగా పత్రాలు ఇచ్చిన అధికారులు ఇప్పుడు పిటిషనర్లకు నోటీసులు ఇవ్వడంపై జస్టిస్ వినోద్‌కుమార్ సందేహాన్ని వ్యక్తం చేస్తూ.. తదుపరి విచారణ 3 వారాలకు వాయిదా వేశారు. ఉస్మాన్‌సాగర్ మ్యాప్ సమర్పించడంతోపాటు కూల్చివేతలపై కౌంటర్ దాఖలు చేయాలని ప్రభుత్వాన్ని ఆదేశించారు.

ఏవైనా నిబంధనలకు లోబడే ఉండాలి..

రంగారెడ్డి జిల్లా శేరిలింగంపల్లి మండలం గుట్టలబేగంపేటలోని దుర్గంచెరువు ఎఫ్‌టీఎల్ పరిధిలో ఆక్రమణల తొలగింపునకు ప్రభుత్వం చేపట్టే చర్యలు చట్టంలోని నిబంధనలకు లోబడి ఉండాలని హైకోర్టు స్పష్టం చేసింది. అక్కడ 15 ఎకరాల్లోని లేఔట్లలో ప్లాట్లను కొనుగోలు చేసినవారికి వాల్టా చట్టంలోని సెక్షన్ 23 కింద డిప్యూటీ కలెక్టర్ నోటీసులు ఇవ్వాడాన్ని సవాలు చేస్తూ దాఖలైన 4 పిటిషన్లపై చీఫ్ జస్టిస్ అలోక్ అరాధే, జస్టిస్ జే శ్రీనివాసరావు ధర్మాసనం సోమవారం విచారణ చేపట్టింది. ఆ నోటీసులను షోకాజ్ నోటీసులుగా పరిగణించాలని అధికారులను ఆదేశించింది. ఆ ప్లాట్లలోని నిర్మాణాల కూల్చివేతకు ముందు బాధితులకు నోటీసులు జారీ చేయాలని, వారు సమర్పించే ఆధారాలను పరిశీలించి, వివరణ తీసుకున్నాకే అధికారులు ముందడుగు వేయాలని ఉత్తర్వులు జారీచేసింది.

సీపీగెటెట్ సీట్ల కేటాయింపు ఆలస్యం!

- ఇటు వర్షాలు.. అటు ఇంకా పూర్తికాని పరీక్షలు
- 4న సీట్ల కేటాయింపు.. కానీ ఆలస్యమయ్యే ఛాన్స్

హైదరాబాద్, సెప్టెంబర్ 2 (నమస్తే తెలంగాణ): పీజీ ఫస్టియర్ సీట్ల భర్తీకి నిర్వహించే కామన్ పోస్ట్ గ్రాడ్యుయేట్ ఎంట్రెన్స్ టెస్ట్(సీపీగెట్) సీట్ల కేటాయింపు ఆలస్యంకానుంది. ఇటు వర్షాలతోపాటు, ఇంకా పీజీ ఫస్టియర్‌లోని విద్యార్థులకు సెమిస్టర్ పరీక్షలు పూర్తికాకపోవడంతో ఇప్పట్లో ఫస్టియర్ విద్యార్థులకు సీట్లు కేటాయించలేని పరిస్థితి నెలకొన్నది. సీపీగెట్ మొదటి విడత కౌన్సెలింగ్ కొనసాగుతున్నది. షెడ్యూల్ ప్రకారం 4న సీట్లను కేటాయించాల్సి ఉంది. అయితే ఇది అనుమానంగానే కనిపిస్తున్నది. తాజా పరిస్థితుల నేపథ్యంలో ఓ నాలుగైదు రోజులు ఆగి సీట్లను కేటాయించాలని అధికారులు భావిస్తున్నారు.

ప్రధాన వర్సిటీల్లో పీజీ ఫస్టియర్ సీట్లు	
వర్సిటీ	సీట్లు
ఉస్మానియా	12,682
కాకతీయ	12,675
శాతవాహన	5,345
తెలంగాణ	4,210
మహాత్మాగాంధీ	3,177
పాలమూరు	3,070

278 పీజీ కాలేజీల్లో 44వేలకు పైగా సీట్లుండగా, ఈడబ్ల్యూఎస్ సీట్లను కలుపుకుంటే వీటి సంఖ్య 50వేలకు చేరుతుంది. ఈ ఏడాది 73వేల మంది దరఖాస్తు చేసుకోగా, 61వేల మంది (94,.57శాతం) క్వాలిఫై అయ్యారు. కొంత కాలంగా పీజీ కోర్సుల్లో సీట్లు నిండటం లేదు. ఏటా 45శాతం సీట్లు మాత్రమే నిండుతున్నాయి. ఈ ఏడాది క్లినికల్ న్యూట్రిషన్, న్యూట్రిషన్ వంటి కోర్సుల్లో సీట్లు పెంచుకునేందుకు పలు కాలేజీలు ముందుకొచ్చాయి. దీంతో ఆయా కోర్సుల్లో స్వల్పంగా సీట్లు పెంచుకున్నట్టు అధికారులు తెలిపారు.

పీజీఈసెట్ వెబ్ కౌన్సెలింగ్‌లో మార్పులు

ఎంఈ, ఎంటెక్, ఎం ఫార్మసీ కోర్సుల సీట్ల భర్తీకి నిర్వహించే పీజీఈసెట్ వెబ్ కౌన్సెలింగ్ షెడ్యూల్‌పై వర్షాల ఎఫెక్ట్ పడింది. రాష్ట్రంలో వర్షాలు, వరదల నేపథ్యంలో ఖమ్మం, మహబూబాబాద్ జిల్లాల్లో విద్యుత్తు, ఇంటర్‌నెట్ సరఫరాలో అంతరాయం తలెత్తిన నేపథ్యంలో మొదటి విడత షెడ్యూల్‌ను అధికారులు సవరించారు. ఇప్పటికే రిజిస్ట్రేషన్ గడువు ముగియగా, మంగళవారం వరకు సర్టిఫికెట్ వెరిఫికేషన్ చేపడతారు. 4,5 తేదీల్లో వెబ్ ఆప్షన్లు నమోదుకు, 6న సవరణకు అవకాశమిచ్చారు. 9న సీట్లు కేటాయిస్తారు. 10 నుంచి 13 వరకు కాలేజీల్లో రిపోర్ట్‌చేయాల్సి ఉంటుంది. 10 నుంచి క్లాసులు ప్రారంభమవుతాయి. కొన్ని ఎం ఫార్మసీ సీట్లకు ఫార్మసీ కౌన్సిల్ ఆఫ్ ఇండియా ఇంతవరకు అనుమతివ్వలేదు.

ఎంబీఏలో 33వేలు.. ఎంసీఏలో 6వేల సీట్లు

హైదరాబాద్, సెప్టెంబర్ 2 (నమస్తే తెలంగాణ): ఇంజినీరింగ్ తర్వాత అత్యధిక డిమాండ్ ఉండేది ఎంబీఏ, ఎంసీఏ కోర్సులకే. రాష్ట్రంలో ఈ ఏడాది 264 కాలేజీల్లో 33, 620 ఎంబీఏ, 65 కాలేజీల్లో 6,162 ఎంసీఏ సీట్లు అందుబాటులో ఉన్నాయి. ఆయా వివరాలను సాంకేతిక విద్యాశాఖ సోమవారం విడుదల చేసింది. కన్వీనర్ కోటాలో ఎంబీఏలో 23,989, ఎంసీఏలో 4,583 సీట్లు ఉన్నాయి. వర్సిటీలవారీగా తీసుకుంటే ఓయూలో 117 కాలేజీల్లో 17,615 ఎంబీఏ, 42 కాలేజీల్లో 3,900 ఎంసీఏ సీట్లున్నాయి. జేఎన్టీయూలో 95 కాలేజీలుంటే 10,125 ఎంబీఏ, 9 కాలేజీల్లో 942 ఎంసీఏ సీట్లున్నాయి. కాకతీయలో 26 ఎంబీఏ కాలేజీల్లో 2,820, 9 కాలేజీల్లో 900 ఎంసీఏ సీట్లున్నాయి. సోమవారం వరకు 10,634 మంది కౌన్సెలింగ్‌కు హాజరయ్యారు. 8వరకు ప్రాసెసింగ్ ఫీజు చెల్లింపు, స్లాట్ బుకింగ్‌కు అవకాశముండగా, మంగళవారం నుంచి 9 వరకు సర్టిఫికెట్ వెరిఫికేషన్ చేపడతారు. 4 నుంచి 11 వరకు వెబ్ ఆప్షన్లకు అవకాశముంది.

గిరిజన రైతులపై పోలీసుల జులుం



వరంగల్ జిల్లా నల్లబెల్లి మండలం మూడుచెక్కలపల్లె రంగాయ చెరువు రీడిజైనింగ్‌ను వ్యతిరేకిస్తూ ఆందోళన చేస్తున్న గిరిజన రైతులు, బీఆర్‌ఎస్ నాయకులపై పోలీసులు జులుం ప్రదర్శిస్తున్నారు. వారిపై కేసులు నమోదు చేసి అరెస్టుకు యత్నించగా గ్రామస్థులు మూకుమ్మడిగా అడ్డుకున్నారు. ఈ మేరకు గోవిందాపూర్ గ్రామ రైతులు సోమవారం ఎమ్మెల్యే దిష్టిబొమ్మకు శవయాత్ర నిర్వహించి దహనం చేశారు. బీఆర్‌ఎస్ నాయకులను అరెస్ట్ చేయొద్దని, అవసరమైతే తామంతా పోలీస్‌స్టేషన్‌కు వస్తామని పోలీసులతో వాగ్వాదానికి దిగారు. దీంతో కొద్దిసేపు ఉద్రిక్త వాతావరణం నెలకొంది.

వైద్య సిబ్బందికి భద్రత పెంచండి

హైదరాబాద్, సెప్టెంబర్ 2 (నమస్తే తెలంగాణ) : ప్రభుత్వ దవాఖానల్లో పనిచేసే వైద్య సిబ్బందికి భద్రత పెంచాలని వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ ఆదేశించారు. మహిళా డాక్టర్లు, నర్సింగ్ ఆఫీసర్లు, సిబ్బందికి రక్షణగా షీ టీమ్‌లతో రాత్రివేళ పెట్రోలింగ్ నిర్వహించేలా నిబంధనలు రూపొందించాలని సూచించారు. ప్రభుత్వ దవాఖానలు, మెడికల్ కాలేజీల్లో భద్రత బలోపేతంపై సుప్రీంకోర్టు నిబంధన మేరకు సోమవారం సచివాలయంలో ఆయన ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. వైద్య సిబ్బందిపై దాడుల నియంత్రణకు 2008 చట్టంపై చర్చించారు.